56

# మా వోటులు మీకే!

**జ**డ్.పి.టి.సి. నామినేషన్ వేసిన కాణ్ణుంచి నెట్టికల్లప్ప బొందలేటి జడ్.పి.హెచ్.యస్ వెలుపలి గోడనానుకుని, వేపచెట్టుకింద, అంగీలేని పైని గాలికొదిలి, అడ్డపంచె పైకిలాగి డ్రాయరు లాగా బిగదీసి, మేకమార్కు బీడీ, అగ్గిపెట్టే తీసి, బీడీ ముట్టించి, గుప్పుగుప్పున పొగవదులుతూ తుప్పుతుప్పున ఉమ్మివేస్తూ, కాళ్ళు నిగడదోలి, కడ్డీలాగా కూర్చున్నాడు.

నెట్టికల్లప్పకి పెళ్ళం లేదు, పొలం లేదు. ఆస్తిపాస్తులు లేవు, తిండి లేదు, తీర్థం లేదు, ధనం లేదు. జనం లేరు. తంతే అడ్డమొచ్చేవాళ్ళు లేరు. చస్తే మోసే వాళ్ళు లేరు.

మరి నెట్టికల్లప్పకున్న దేమిటి? ఈ దేశంలో చచ్చినా, బతికినా, కాల్చినా, పూడ్చినా, తన్నినా, తరిమినా, ఉండే కులముంది. ప్రాణముంది. దాన్ని దాచుకొన్న గుండె ఉంది. గుండెకు ఊపిరుంది. బొటనేలుంది. వేలు ముద్రుంది.

వేలుండగా, వేలుముద్దరుండగా, ఎవరో వచ్చి వేయమంటే వేయకుండా ఉండటానికి నెట్టికల్లప్పకి కళ్ళు లేవా? కాళ్ళు లేవా? కాటుకలేదా? వేలికి రాసుకోలేదా? కాగితాల కంటించలేదా? అంత జవచ్చినవాడా? కాదు. వేలిముద్రలేస్తే నామినేషన్ వేశాదన్నారు. జయి కొట్టినవాడులేదు, కాఫీ తాపినవాడు లేదు. ఊరేగింపులేదు. టపాసులు కాల్చింది లేదు. ఏమీ లేదు.

ఏమాటకామాటే చెప్పుకోవాలి. బీడీకట్టా, అగ్గిపెట్టే కొనిచ్చారు. బీడీ పీలిస్తే నరాలన్నీ గుంజుతాయి. స్వర్గం గుండెలో దూరి గురగురలాడుతుంది. అరవయ్యేళ్ళయినా, ఆడపిల్ల కనబడితే, నరాలు జివజివలాడతాయి. అదొక్కటే సంబడం! ఆడపిల్లలున్నవాళ్ళు అతణ్ణి ఇంటి ఛాయలకు రానీరు. అందువల్ల స్కూలు గోడ పదిలం. బీడీ భద్రం.

నెట్టికల్లప్పకు పూర్వకాలంలో, అతి ప్రాచీన కాలంలో ఒక భార్య ఉండేది. ఉన్న ఆమె ఊరికే ఉండలేదు. ఒక కొడుకును, ఒక కూతురిని కంది. కని, అత్తవారింటిలో ఉండక, పుట్టింటికి పోక, ఎక్కడికో పోయింది. స్వర్గానికన్నారెవరో. స్వర్గానికే చచ్చిందో, నరకానికే చచ్చిందో చచ్చిన కాణ్ణుంచి నెట్టికల్లప్పను, నలపయ్యేళ్ళ నుంచి చంపుతూ ఉంది. కూడూ కుమ్మూ లేకున్నా చింతలేదు, నీళ్ళూ నిప్పులూ లేకపోయినా తంటాలేదు. పిల్లల్ని పెంచేదే చావు. పెళ్ళాం చచ్చిబ్రతికి పోయింది. నెట్టికల్లప్ప బతికుండగానే పిల్లల్నిచ్చి చంపింది. అతడికి పిల్లలంటే బలే బెమ. ఎట్టుంటారు వాళ్ళు? పిల్లవాడు ఎరుపు. పిల్ల తెలుపు. ఎరుపు తెలుపు.

సూర్యచంద్రులు వాళ్ళే అతడికి, రాత్రీపగలు. నిద్రలేదు. నిద్ర మానుకోవచ్చు. పాలు? ఎవరిస్తారు? ఎవరు తెస్తారు? లెక్క?

ముండమోపి వాళ్ళు, పిల్లల్లేనివాళ్ళు, పెళ్ళికాని ముదురు కన్నెపిల్లలు. ఆ పిల్లల్ని పెంచి, అలనా, పాలనా చూసి అతణ్ణి బతికించారు. అతడింకెందుకు పెళ్ళి చేసుకొంటాడు? చేసుకోలేదు. పిల్లలు పెరిగి ముత్యాలు రత్నాలు అయితే మనువులు చేశాడు. అల్లుడిల్లరికం వచ్చాడు. కోడలు కొండలు తెచ్చింది, అతణ్ణి కొట్టినా కోసినా, తిట్టినా తిమ్మినా, గుంజినా పీకినా ఇంటిపట్టున ఉండదు. 'నాది తిరిగే కాలు, తిట్టే నోరు' అనీ, 'నాది పుటకలతో వొచ్చిన బుద్ధి పుడకలతో కానిపోదు' అనీ, ఆడా ఈడా తిరుగుతూ ఉంటాడు.

నెట్టికల్లప్ప ఎక్కడ కూర్చుంటే, అక్కడికే గిన్నె చెంబు తెస్తారు మనమళ్ళు. తిని వాటిని ఆడనే పారనూకి ఆడేబడి నిద్రపోతాడు. తెచ్చినవాటిని తీసుకుపోయేది వాళ్ళ ఇష్టం. అల్లుడూ కొడుకూ బాగున్నారు. ఊళ్ళోవాళ్ళు అతణ్ణి తిన్నావా, తింటావా అని అడిగి పెడతారు. అడుక్కుతినడు. వాళ్ళను ఆశీర్వదిస్తున్నట్లు తింటాడు.

అతడికి ఇల్లూ వాకిలీ లేదు. పిల్లలుగిల్లలు అక్కరలేదు. ఎవరు పేపరు చదువుతున్నా, 'పెద్దంగా సదూ సాఁవీ' అని కూర్చుంటాడు. చదివేవాళ్ళ ఓపిక. చెవుల తుప్పు వదిలిందాకా వింటాడు. రచ్చబండ రాజకీయాలు చెవులు నిక్కబొడుసుకొని వింటాడు.

పేపరు చదివితే వినేది, టి.వి. న్యూసు చూచేది, రేడియోవార్తలు ఆలకించేది. అతడికి పెద్దరంధి. కొందరికి కల్లు సారాయి బ్రాందీ విస్కీ రమ్ము తాగితే కిక్కు. కొందరికి నల్లమందు, బంగు మింగినా పీలిచినా కిక్కు. కొందరికి చేయి తగిలినా చెంగుతగిలినా, గజ్జెలు ఘల్లుఘల్లు మన్నా, గాజులు గలగలమన్నా కిక్కు. నెట్టికల్లప్పకి వార్తలు విన్నా, చూచినా యమకిక్కు. పైసా ఖర్చులేని, ప్రమాదంలేని కిక్కు.

అతణ్ణి జడ్.పి.టి.సి. నామినేషన్ వేయరా అంటే లేడికి లేచిందే పరుగు. వేలిముద్రలు వేయమన్నచోట కుమ్మిపారేశాడు. అప్పణ్ణుంచి అతడికి యమ గిరాకీ. ఓట్లు వేస్తామని ఎవరూ రాలేదు. విత్‌డ్రా చేసుకోమనేవాళ్ళు ముసురుకొంటున్నారు. తనను గుర్తించారని, తనని అడుక్కుంటున్నారని పొంగిపోయి మరింత నిగిడి నీలిగి బీడి ముట్టించి దీక్షగా దమ్ము పీల్చి దొమ్మ పొగురు చూచుకొన్నాడు.

ముందు అనుచరగణం వచ్చారు. అతడు వినలేదు, అవుననలేదు. కాదనలేదు. అసలు వాళ్ళే వచ్చారు. కాంగ్రెసు, తెలుగుదేశం, బిజెపి, అభ్యర్థులు వచ్చారు వరసగా, ఒకరి తరవాత ఒకరు. విత్‌డ్రా చేసుకోమన్నారు.

"సిపియమ్మ, సిపియయ్య రాలేదేమప్పా' అని అజ అడిగి 'వాల్లొచ్చి నెట్టిగా వొద్దురా తొలగరా అంటే తొలగేదేనప్పా సెబతన్నా సుడీ, మాట తప్పేది లేదు. మాట తప్పేకి నేనేఁ వన్నా మా యయ్యకి బుట్టినోన్ని గానా? తప్పను' అన్నాడు. వాళ్ళు పోటీలో లేరని, పొత్తులవల్ల

వేరే నియోజకవర్గం వాళ్ళకు కేటాయించారని వాళ్ళు చెప్పారు. 'అట్టాగానయితే నేను తప్పుకోను దేవరా!' అన్నాడు. ముగ్గురుతో మూడుసార్లు అదేమాట చెప్పాడు.

'వాల్లు పోటీలో లేరని తెలిసే ఈ వంకర కూతకూత్తన్నాడు' అనుకొన్నారు వాళ్ళు.

'మీరు తిమూర్తులాకట్ట ఉన్నారు దేవరా! మీకు మాటిచ్చి మరోపని జేసేకి అయితాదా?' అది ముగ్గురుతోనూ అదే డైలాగు రీటేకుల్లో మూడుసార్లూ చెప్పాడు.

ఎటువంటి చోట చెప్పాడు?

స్కూలు బయట, గోడపక్క, సర్కారుకంపికాడ, కసువుకంప మధ్య, దుమ్ము ధూళి నడుమ చెప్పాడు.

వాడు కూర్చుండే నేలమీద! వాళ్ళేడ కూర్చోవాలి! కుర్చీలు లేవు. బెంచీలు లేవు. కూర్చున్నవాడి ఎదుట వాళ్ళు నిలబడి మాట్లాడటం అవమానం కదా! వాడా లేవడు. వీళ్లా నిలబడరు. కూర్చోవాలి! ఏడ? గుండులు బండలుమీద! రాయలసీమలో ఎప్పుడయినా ఎక్కడయినా కావలసినన్ని గుండులు బండలు పండుతూ ఉంటాయన్న సత్యం ప్రపంచానికి తెలుసు.

వాడెట్టా కూర్చున్నాడు? కాళ్ళు ఆరజాపి, నిగడదోలి! ఏమంటున్నాడు? 'దేవరా! ముసిలోన్ని! కాటికి కాల్లారజాపుకున్నోన్ని! మోకాల్లు నొవ్వ! వంగవు! మడసలేను. లేవలేను. దయతలసల్లా!' అంటే వాళ్లేమన్నారు? 'పోన్లేరబ్బా. పెద్దోనివి. మందులో మాకులో పాడోపరదేసో ఏసుకోకపోతివా? సచ్చేదానికి నువ్వు గాంగా అంతగా ముసిలోని వేంగాదులేరబ్బా! నాలుగ్గాలాలు బతకరానేట్టీ!' అన్నారుగానీ, 'ఈనాకొడుకు కాల్లారజాపి యేం పొగురుగా కూసుండాదురా' అని తిట్టుకొన్నారు. అంతటితో ఊరుకోలేదు. 'వానెవ్వ, వాడెవుడో గాడిద కాల్లు బట్టినాడంట గదేమప్ప. ఈనాటికి వాడెమ్మడెక్కడేలి వీని కాల్లకాడికొచ్చే పని బడినాది గదరా దయివమా?' అని దిగులుపడినారు.

'నాలిక పీకుతాది దేవరా బీడీ తాక్కపోతే'. అవి నెట్టికల్లప్ప అన్నాడో లేదో, అందరూ 'పీకదామడి. అది నాలికా తాటిపఱ్ఱా కాలసరా నెట్టీ బీడీ' అన్నారు కానీ, 'వీడు ఏనాడేగాని ఎదటబడితే, బీడీ ఆరిపి, దాసి, పొగమింగి యెటో యెట్టో వొదిలే దొంగనాకొడుకెయ్యాల ఖెదటే బీడి ముట్టిత్తంటే సూడాలిసిన కర్మగాలింది గదరా, పొద్దుటే లెగిసి ఎవునిమొగం జూసినానో గానీ ఈ ముండమోపోని చేదవలు సూపే దరిద్దరం నెత్తికి జుట్టినావుకదరా దయివమా?' అని గింజుకులాడటం తప్పలేదు.

'వాని కత వాందే! వాడు ఎవుని మాటా ఇన్డు. రమ్మంటే రాడు. పొమ్మంటే పోడు. పెడసరపునాకొడుకు. వానికి మేం సెప్పగల్దుంమా? మీరేగాదు, మీ తాతముత్తాతలు సెపినా ఇనే నాకొడుకుగాడువాడు. ఇగ మీ ఇస్టం. వానిస్టం' నెట్టికల్లప్పను పోటీ విరమించుకోమని తమ కోసం చెప్పమంటే అల్లుడూ కొడుకూ చెప్పిన మాటలవి.

'నువ్వు అబియరిదివా? పతియరిదివా?' అని ప్రశ్నించాడు నెట్టికల్లప్ప బిజేపి అభ్యర్థిని. ఈ ప్రశ్న అతనూహించలేదు.

'సాఁవీ, రెడ్డొయప్పకు కూలోల్లు ఎవురేగాని వోటేత్తే యేత్తారు. కమ్మొయప్పకి వోటులు పడితే పడతాయి. నీకీ నాకీ వోటులు యవురేత్తారు బేపనాయనా? వొద్దు పోసోఁవి! నేను గాదు గానీ, నువ్వే పోటీనుంచి ఇరమిచ్చుకోదేవరా!'

'యేమిరా! నాకేల వోటేయర్రా జనాలు?'

'దేవరా! యెప్పుడూ మీరేనా యేలికలు? మీరంటే జనాలకి మంట. సింతపొందు పడతాది. మీ కాము ఎక్కవసాఁవి. జనాలందరూ యదవలనే గందాసాఁవి మీరనుకునేది? జనాలు మీకు యెయ్యరు దేవరా వోటులు. నువ్‌బోసాఁవి. నేను బీడి తాగల్ల! నా బీడి గూడక నన్ను తాగనీవా? యాదాలు యిన్నీకబోతివి! కడుపునిండా కూడు తిన్నీకబోతివి. కంటినిండా సుఖంగా కునుకు దీయనీకబోతివి. అంటంటివి. మయిలంటివి. జనాల్ని యెంటేసుకుని వాల్లకీ అంటూసొంటూ అంటా నూరిపోత్తివి. మీరందరు ఊర్లో బడితిరి. మమ్ముల్ని బందీలను జేత్తివి. పల్లె జయిల్లో మమ్ముల్ని సాయమంటివి. అందురుతో వచ్చి సంపబడితివి. సాల్‌సాల్లే సాఁవి. బుద్దున్ననాకొడుకెవుడూ నీకోటేడు'.

'నెట్టోడా యెన్నికూతలు కూసినావురా! గుణాంచుకో నేన్నీ ప్రత్యర్థిని'.

'ఉణ్ణిసాఁవి! ఈ యెంటికలు సూసినావా, అందురుణ్యారు పతి యరుదులు. వాల్లతో గాంది, నీతో అయితాదా! పోసాఁవి.'

నామినేషన్ విరమణ రోజు చివరి నిమిషందాకా వొకరెనకొకరు నెట్టికల్లప్పను పోటీనుంచి తప్పుకోమని అడుగుతూ ఆశపెడుతూ ఉన్నారు.

ఒకడు 'బీడీకట్ట, అగ్గిపెట్టె కొనిస్తా'నన్నాడు.

'యంతకాలం సాఁవి?'

'యంతకాలమేగానీ!'

'నామునేసను యేపిచ్చకముందటే సెప్పిండకూడదేమి సాఁవి ఈ ముక్క?'

ప్రత్యర్థి ఏమీ మాట్లాడలేదు.

మరొక ప్రత్యర్థి 'కూడు, గూడు, గుడ్డ బతికినంత కాలం గేరంటి?'

'ఎవురు బతికినంత కాలం సాఁవి?'

'నువ్వు!'

'నువ్వు జత్తే నాకేం గేరంటీ దేవుడు'.

ప్రత్యర్థి మాట్లాడలేదు.

'ఎలచ్చను కాంగానే సంపుతావా? సంపిత్తావా? సెద్దెగాల్లతోనా? ముటాలోల్లతోనా? కరుసులేని పని!'

ప్రత్యర్థి నోరెత్తలేదు.

'ముసిలోడయినా బసిరెడ్డి మేలని నెట్టికల్లూ! నువ్వే మేలురా! నువ్వు ముసిలోనివి కావురా, పాయపోనివి'

'నేను ముసిలోన్నేదేవరా!'

'ముసిలోనివే అయినా మేలు మొగోనివిరా. పాయపోల్లు దేనికి నిలుత్తార్రా నీ యదట బలాదూరు గాదూ!

'దేవరా! యేంది దేవరా మునగ సెట్టెక్కిత్తన్నావు?'

'పెళ్లయితే నీకి నలుగురు పుడతార్రా నెట్టికల్లూ!'

'నిజమే దేవరా! నువ్వనేదేమో నిజమే కానీసాంవి నీకెవరిత్తారు కన్నెపిల్లని?'

'ఎవురేగాని ఇత్తార్లేవై! పాయప్పాపలు ఉరికిరారా?'

'మా ఇలాకాలో కన్నెపిల్లల్లేరు సాంవి. సన్నూ సంకాలేని, కాపుకురాని పూతాపిందెల్ని లగ్గం సేసి తోలేత్తారు దేవరా మావాల్లు! మావాల్లొట్టి దొంగ నాకొడుకులు దేవర! మీ వాల్లలో కన్నెపిల్లలేంవన్నా ఉన్నారేం దేవరా? పెల్లీడోల్లు – నాకిచ్చేకి – నేనురడీ దేవర,. నువ్వన్నట్టు పిల్లలు కలగేది గేరంటీ దేవరా!'

'నెట్టిగా నీకెంత పొగుర్రా?!'

'నీకు లేని పొరుగు నాకేందుంది దేవరా? నువ్వడిగితే గాంగా బదులాడితిగాని ఉరికి అంటినా దేవరా?'

'మావాల్ల కన్నెపిల్ల నీకు పెల్లంగా కావలేంవై?'

'నువ్వేకదేందేవరా నా పెల్లి సేత్తానంటివి?'

'అనింటినిరా అనింటిని. పెల్లి సెయ్యాల్ల! సేసేదే! పేనం తియ్యల్ల! తీసేదే! సంపుతారా!

'యెబుదు సంపుతా?'

'తట్టుకో!'

'ఎలచ్చన్ల ముందు సంపితే, ఎల్లచ్చన్లు కేనిసిల్లు! గెలవాలిసినోనివి గెలవ్వు. ఎలచ్చన్లు కాంగా సంపుతావా? మల్లీ ఎల్లచ్చనుల్లో గెలవ్వు. అయినా సదే సంపుతావా? నా పాపాలు నీకు జుట్టుకొంటయ్యి. నాకు సొరగం. నీకు నరకం. సొరగంలో రంబ, ఊరవోసి, మేనక, దానెమ్మ తిలోతమ్మ సొరగం నిండా పెల్లాలే! నా పెల్లాల కీంవీ రేషనులేదు. నీకే దరిద్దరం. పోలీసోల్లు నిన్ను సంపుతారు. యమా కింకరోల్లు సంపుతారు. సచ్చి సుకపడేది నేను. నువ్వు

బతికి సచ్చేది! సంపుదేవరా! యా పొద్దు సంపుతా? యట్టా సంపుతా! దేంతో జంపుతా?'

'యట్టాడో సంపుతాలేవై! దేంతో జంపుతానా నా యిస్టం! నీగ్గాని సెప్పల్లా?'

'వొద్దు దేవరా? సెప్పొద్దు! సేత్తోనా? యాట కొడివిలితోనా? గండర గొడ్డలితోనా? గడారుతోనా? పికాసితోనా? బాకుతోనా? బరిసెతోనా? బాంబుతోనా? పిస్తోలుతోనా? దేంతో సంపుతావు దేవరా! అయి మాకాడా ఉణ్ణాయి. లేదంటే సెప్పు. దేంతో జంపుతా? కులంతోనా? లెక్కతోనా? ఆఁముతోనా? అదికారంతోనా? ఆంకారంతోనా? అయి మూతాన లేవు! నన్ను సంపి నువ్వు బతికుండగలవా?

ప్రత్యర్థి పిచ్చివాడులాగా చూశాడు.

నెట్టికల్లప్ప బీడిముట్టించి ఊపి, ఉసీగా ఒక్క దమ్ము బీలిత్తే, బీడి సురసురమని దివిటీలాగా వెలిగి సగం పైగా కాలిపోయింది. 'వీనెమ్మ కడుపు మాడా, వీని కడుపులో యెంతుండినాది?' అని ప్రత్యర్థి అనుకొంటున్నప్పుడు, అంతదాకా మాటలు వదరిన నెట్టికల్లప్ప పొగ వదిలాడు. పొగకంపు! పొమ్మనలేక పొగబెట్టినట్లయి, ప్రత్యర్థి లేచి వెళిపోయాడు.,

గోడనీడ వీరుడు ఎవరెవరితో ఏమేమి మాట్లాడింది వందిమాగధులు, అనుచరగణం అందరికీ టాంటాం వేస్తూ పోతున్నారు. ఆ మాటలు విన్న దళితులు పొంగిపోసాగాడు. తామనలేని మాటలు కనీసం వినలేక పోయామే అని చింతించసాగారు.

నెట్టికల్లప్పకు వోటు వేస్తామనే మగధీరుడెవడూ కనపడలేదు. ఆడ రుద్రమ్మలూ అగపడలేదు. ఇతడు కూడా ఎవరినీ ఓటు అడగలేదు.

ఏక్ తార మోగించుకొంటూ బిచ్చమడుక్కొనే సిద్ధోజీ నెట్టికల్లప్పను చూచివచ్చి కూర్చున్నాడు. పచ్చికంకులు దాసప్పా అంటే రాలినకాడికి గోవిందా అనే బాపతు. బొందలేటకి పర్మనెంట్ బిచ్చగాడు. ఏడనుంచి వచ్చాడో తెలియదు. ఏడకీ పోడు. ఎప్పుడు పోతాడో తెలియదు. పెళ్లాం పిల్లల్లేరు. గుండులాగున్నాడు. పెద్దవయస్సుకాదు. బాదరబందీలేదు. ఏకోనారాయణ నెట్టికల్లప్పకు సరిజోడు!

'యేం సిద్ధోజీ! యాడికప్పా యలబారినావు?' అని నెట్టికల్లప్ప అడిగినాడు.

'నీకాడికే! బీడీగాని ఉందేమప్పా'

'ఊరికేరారు మాతుములు' బీడి ఇచ్చాడు.

"యాలనప్పా పోటీ, గెలిచేవోనివేనా?'

'గెలుత్తానో, వాడతానో, నీ ఓటు నాకేయ్యల్లసుడీ!'

'నీ బీడీ తాగినంక, వోటేయక పోయేదానికయితదా?'

సిద్ధోజీ బీడి ముట్టించి ఒక దమ్ములాగి, పంచప్రాణాలు కుదుటబడి, చతికిలబడి, ఏక్తార టింగుటింగుటింగు మనిపించాడు.

'యాడనో యస్సీ సీటుకేడవక, జనరలు సీటు కెగబడినాడేమిరా యీ ముండమోపోడు' అని తిడుతూ ఉన్నారని చెప్పాడు.

'తిట్టనీ!' నెట్టికల్లప్ప సవ్వేశాడు

'నీకాక్కోటు గూడకరాదనిరి!'

'మన రోండోట్లు గేరంటి గదేంలే!'

ఏక్‌తార టింగుటింగుమంది.

'దళితుల్ని బెదిరిచ్చి వోట్లు గుద్దిచ్చుకునేది ఇక సెల్లదు. మీ వోటులు దెచ్చి మాకీయండిరా పెట్టెల్లో మేమే యాత్తామనేది ఇక సాగదు. మీ వోటులు వద్దు కల్లుదాగండి, నిద్దరబొండి అనే కాలం పాయ. గుడికట్టిత్తం, బడికట్టిత్తం, రోడ్దేపిత్తం, కొళాయి యేపిత్తం అనే రోజులూ పాయ. బందిల దొడ్డుల్లో బెట్టి సిలుకుబెట్టి తాలం కప్పలు దగిలిచ్చే పొద్దులు వల్లకాటిలో కలిశ. పొట్టేళ్ళ కోయిచ్చేది. సారా పాకెట్టులు సంచె సత్తెకాలం యేట్టోకలశ. తిట్టి, కొట్టి, సంపి, బెదిరిచ్చి, వోట్లు గుద్దిచ్చుకునేది సెల్లిపాయ. లెక్కతేబట్టిరి, సారా ఈ బట్టిరి, దుడ్డు పంచబట్టిరి, వోటులు కొల్లగొట్టిరి, యెంతకాలవప్పయ్యా ఈ ఆగడాలు?

'ఈ పొద్దూ అదే! యా పొద్దూ అదే, లెక్కకీ, సారాకీ దేవుడు దిగిరాడా?'

'లెక్క దొబ్బేది నిజమే, వోటు యెగదొబ్బేదీ నిజమే. కాలం మార్లా! తాడూ బొంగరం లేనోన్ని యవుడేగాని యేమీసెయ్యరు. అన్నీ ఉన్న ఆకు అణిగిమణిగి ఉంటది. ఏమీలేని ఆకు ఎగిరెగిరి పడతది. దళితుడు బతకల్లంటేనే బేజారు. మడి ఎలచ్చనల్లో నిలబడల్లంటే యంత ధయిర్యం కావల్ల? నాకుపోయేదేంది పుట్టగోసి! బేపనోల్లను బడనూకి రెడ్లు కమ్మల గవరమెంటు వచ్చె. వీల్లను దొబ్బేసి మరో మంచి గెలసడా? కాంగ్రెసు వచ్చె రెడ్డొల్లకి కిరీటాలొచ్చి వాల్లు గెలిశ, తెలుగుదేశం వచ్చ. కమ్మొల్లకు కాల్లొచ్చ. వీల్లు గెలిశ, వాల్లేనేమప్ప మంచులు? మడిగ మంచులు లేరా? బగుజన పార్టీ వచ్చ, దరిద్దురులు నిలబడిరి. గెలసల్లా? వొద్దా?'

'గెలసల్ల!'

'మడిగనేం, వోటేత్తే అయిపోయ!'

'వీల్లు నోర్లేని మూగి దెయ్యెలు. నీకు వోటేత్తే వీల్లు సావరూ?'

'నోరెత్తేదేల? వోటేత్తేసడి!'

'లెక్కతింటన్నారే!'

'ఎవుని లెక్కేగాని తిను ఇస్తే యాలవద్దనాల? వోటు రగస్సెం-నీ బుద్ధి బుట్టినోనికి గుద్దు!'

'ఆ తెలివి వుండొద్దా?'

'తెలివి ఒగని సొత్తుకాదు సిద్దోజీ'

వాడి ఏక్‌తార వాడట్లా టింగుటింగు మనిపిత్తన్నాడు. వీడి పేపరు పాండిత్యం వీడిట్లా వివరిస్తున్నాడు. ప్రత్యర్థులు వాళ్ళు ఆలోచనల్లో వాళ్లున్నారు.

ఈ జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గంలో ఎనభై వేల ఓట్లున్నాయి. ఇరవైవేలు దళితులవే. సాయిబులు బీసిలు అంతా కలిపితే అరవైవేల పైచిలుకుమాటే! అరవైవేలు కంటే ఎక్కువ వోట్లు పోలుగావు. ఇది చతుర్ముఖ పోటీ! ఇరవై వేల ఓట్లు వచ్చినవాడు గెలుస్తాడు. బి.సిల యస్సీల ఓట్లు చీలి, తమకు రావాలంటే ఏంచేయాలా అని ఎవరికి వాళ్ళు ఆలోచనల్లో ఉన్నారు.

వాళ్ళు అంటరానివాళ్ళు. మనం శూద్రులం అనే మంత్రం పనిచేస్తున్నట్లే ఉంది. వాళ్ళు మాదిగలు, వీళ్ళు మాలలు చిచ్చు రగిలేటట్లు ఉంది. ఓటుకింత రేటుకూడా కుదురుతూ ఉంది ప్రచారానికి మనిషికింత కూలి కూడా గిట్టుబాటుగా ఉంది. ఉన్నవాడి ధనం తరుగుతూ లేనివాడి కడుపునిండుతూ ప్రజాస్వామ్యం వర్ధిల్లేటట్లుంది.

'దళితుల మజ్జ సిచ్చు?' సిద్దోజీ ఏక్‌తార టింగు టింగుమంది.

'సిద్దోజీ! మాలో మేం దాయాదులం. పక్కోళ్ళతో మేం అన్నదమ్ములం. మాలో మేం కొట్టుకుసత్తాం. ఎవుడన్నా మా జోలికొత్తే మేం ఏకమై సావనూకుతాం'

'మడి తెలగ, బలిజ, ఒంటరి, కాపు ఓట్లు?'

'వాళ్లే, మా మూలధనం. మా వోట్లన్నీ వాళ్లయే!

'కురబ, కురవ, కురమ, యాదవుల ఓట్లు?'

'వాల్లు మా బందుగులు. మా ఇల్ల అల్లుల్లు. కుష్నుడు మాయింటి అల్లుడే గదేమప్పా! 'నాలుగు తెగల సాలెల ఓట్లు?' 'నా ఎన్నికల మానం గప్పికాపాడేది వాల్ల సేతినూలుపోగే! వాల్లే లేకపోంగా నేనేడుంటి?'

'కమ్మరి, కుమ్మరి, సాకలి, మంగలి?'

'వీల్లేకదేంరా బగుజనులంటే? వీల్లేదే మా పార్టీ!'

'బాయోల్లు?'

'నా ఎలచ్చను పత్తరాల కిందా మిందా సంతకాలు బరికిందెవ్వురనుకున్యావ్? బోయ నరసింలు బోయ కిష్టప్ప.?

'వడ్డోల్లు, మంటొడ్డొల్లు, గవల్లోల్లు, ఎరికిలోల్లు, యానాదోల్లు, సుగాలీలు'

'అంతా మన తట్టే! డిపాజిట్టు గట్టిందెవ్వురనుకున్యావు? సుగాలి ఆంజనేయులు సుగాలి సుంకన్న!

'రెడ్లు?'

'మా రైతులు, మా కూడూ గుడ్డా వాల్లె!'

'కమ్మలు?'

'వాల్లూ మారైతులే! మా కూలీ నాలీ ఆడే గదేమప్పా!'

'నువ్వొక్కనివే గెలత్తే ఏమయితాది? పుట్టగోసి, ఉంటేనేం? ఊడితేనేం?'

'మా పార్టీ లేదా?'

'ఉంటే?'

'మేంగెలిత్తే జిల్లా మాదే! ఆయెంక రాష్ట్రం, ఆపైన దేశం మాయే. మాదే గవరమెంటు!'

'గోసిలేదు. పట్టుబట్టలా? గంజికి గతిలేదు. బిరియానా? మింగమెతుకులేదు. మీసాలికి సంపంగి నూనా? సాల్లే అన్నా సాల్‌సాలు'.

'యగతాలిగా ఉంది గదరా సిద్దోజీ!'

'ఉందదామడి? ఉట్టికెక్కలేనమ్మ సొరగానికెక్కిందంట! ఎందుకీ తిప్పలు? రోడ్లోల్లో, కమ్మోల్లో గెలిత్తే పోలా? మనకేల ఈ గోల?'

'ఏటెల్లకాలం వాల్లేనా? మడింగ మంచులు లేరా? అందురును సరిసమానంగా జూత్తే ఎవునిగ్గావల్లే ఎన్నికలు? ఆల్లు సూడరే? అంటరాని తనమూ ఉండల్ల! అందురు అన్నదమ్ములాకట్ట ఉండల్ల! కుదిరేనా? కులవృత్తులూ ఉండల్ల! ఈనంగా సూసేది ఉండల్ల! సాద్దెవా? కులంలేదని, దుడ్డులేదని, మంచులు మంచులుగాకుండా పోతారేంరా! అందరుం అన్నదమ్ములాకట్ట ఉండలేవా? ఐకమత్తెంగా ఉండలేవా? అందరుం సరిసమానంగా సమంగ ఉండలేవా? సుఖంగా బతకలేవా? వీల్లు అన్నదమ్ములుగా మారేదాంకా ఎన్నికలు తప్పవు. పోటీలు తప్పవు. అందురుం ఒగతల్లి పిల్లలయ్యేరోజు కోసం ఈ ఎన్నికలు, ఈ పోటీలు, ఈ ఆరాటం, ఈ పోరాటం!'

ప్రచారం ముమ్మరంగా జరుగుతూ ఉంది. రకరకాల జెండాలు రెపరెపలాడుతున్నాయి. ఇళ్ళమీద, చెట్లమీద, చేతుల్లో ఒకరెనక మరొకరు. అందరూ వస్తున్నారు. అడుగుతున్నారు. పోరుతున్నారు. జెండాలిస్తున్నారు. కరపత్రాలు పంచుతున్నారు. దండం పెడుతున్నారు. చేతులు పట్టుకొంటున్నారు. గెడ్డం పుడుకుతున్నారు, భుజం తడుతున్నారు. చేతులు పట్టి ఊపుతున్నారు, ఒక్కపనా? ఒక్కవేషమా? ఒక్క జనమా?

బగుజన పార్టీ అంతులేదు. ఉందోలేదో బొందలేదురాలేదు. ప్రచారం చేయలేదు. గోడకాడ కూలబడ్డ నెట్టికల్లప్ప లేవలేదు. ఓటుకోసం అడగలేదు.

సిద్ధోజికి బాధగా ఉంది. ఆడుకొనే పిల్లల్ని వెంటబెట్టుకొని, 'నెట్టికల్లప్ప' అని తానన్నాడు. 'జై' అని పిల్లలన్నారు. 'నెట్టికల్లప్పకూ' అని అనగానే 'మీ ఓటు' అన్నారు పిల్లలు. ఊరంతా

తిరిగి అలిసిపోయి నీళ్ళు తాగారు. వీళ్ళను చూచి జనం నవ్వారు. 'బిచ్చమెత్తుకొనే నీకేలరా పోలిటిక్సు' అనీ అన్నారు.

దళితులు మూడు గుంపులై, ముగ్గురి మకాముల్లో చేరి మొప్పొద్దులా బువ్వతిని రోజుకు నూరులెక్క, మూడు పాకెట్లు సారా కొండబోతున్నారు.

'పోనీ! వాల్లకూలీ వాల్లు దెచ్చుకోవల్ల' అన్నాడు నెట్టికల్లప్ప.

తాను కూలిచ్చి జనాలను పోగేసి ఓట్లు అడిగించలేదు.

'నీ అల్లుడు రెడ్డి ముఠాలో, నీ కొడుకు కమ్మ ముఠాలో చేరారు'

'సేరనీ! తెలివైనోళ్లు బతగ్గలరు!'

మనవళ్ళు ముప్పొద్దులా గిన్నె చెంబు తెచ్చి తీసుకు పోతున్నారుకానీ, మరెవరూ పలకరించే వాళ్ళు లేరు. జై లేదు. జిందాబాదు లేదు.

నెట్టికల్లప్పను పత్రికలవాళ్లు ప్రశ్నించారు. 'పయోదు సూసుకుంటాడు' అన్నాడు. 'ప్రచారం?', 'పయోదు' 'పంపకాలు?'-'పయోదు', 'గెలుపు?'- 'పయోదు' వాళ్ళకు తిక్కబట్టి 'ఏవడీ పయోదు?' అని అడిగారు. 'పయోడే' అన్నాడు నెట్టికల్లప్ప.

'రేపు ఓటింగు కాబట్టి ఇవాళ ప్రచారంలేదు. మైకులు లేవు. ఊరేగింపులు లేవు. ఇంటింటా తిరిగేది లేదు. కానీ పొద్దుటే ఇడ్లీవడా పొంగల్ తిన్నవాళ్ళకు తిన్నంత. బిజెపి ధర్మం. అందరి చేతుల్లో నోట్లు తళతళలాడాయి.

మధ్యాహ్నం పదిపొట్టేళ్ళు తెగిపడ్డాయి. బిరియాని మాంసం కూర, పెరుగు పచ్చడి ఎవరెంత తినగలరు, పోటీ! జనం పోటీపడి తిన్నారు. సారా పేకెట్ల గోనెసంచులు కుమ్మరించారు. ఎవరికెన్ని కావాలో అన్ని తీసుకొని తాగి తిని తేన్చారు. తెలుగుదేశం ప్రత్యర్థి కుర్చీ తీసుకుని బహుమతులు పంచాడు. అందరూ తీసుకొని జేబుల్లో పర్సుల్లో బహుమతులు భద్రం చేశారు.

సాయంత్రం కోసిన కోళ్ళు ఎగిరెగిరిపడ్డాయి. కూరలు, వేపుళ్ళు, బిరియానీలు రడీ! సారా సంచులు రమ్ముబాటిళ్ళు. తాగారు. తిన్నారు. జైకొట్టారు. చీకొట్టారు. కలబడ్డారు. నిలబడ్డారు. నేలబడ్డారు. నిద్రపోయేముందు కాంగ్రెసు పార్టీ కానుకలు అందుకొన్నారు. పర్సుల్లో పదిలపరిచారు.

దళితులు కూడా పొద్దుటినుంచి, రాత్రిదాకా ఎవరేం పెట్టినా తిన్నారు. ఎవరేం ఇచ్చినా తాగారు. మరేం బహుమతులు కానుకలు ఇచ్చినా తీసి దాపెట్టుకొన్నారు.

నెట్టికల్లప్ప, సిద్ధోజీ మనవళ్ళు తెచ్చిన ఇడ్లీలు వడలు, పొంగళ్ళు బిరియానీలు, మటన్, చికెన్‌లు తిన్నారు.

మత్తుగా తెల్లవారింది. ఎవరికీ నిద్రలేవాలని లేదు. ఓటు వేయాలని లేదు. కానీ వాళ్ళను [illegible]పోనివ్వరుకదా!

ఉదయం నుంచి చాలా కోలాహలంగా ఉంది. పోలింగు మొదలయింది.

ఒక విచిత్రం తప్పక చెప్పుకోవాలి. ప్రతి బూతులోనూ బగుజన పార్టీ ఏజెంటు మిగతా వాళ్ళతో పాటు కూర్చున్నాడు.

ఏ అక్రమం జరగలేదు!

సక్రమంగా ఓట్లు పడ్డాయి!

సాయంకాలానికి అందరూ అలిసిపోయారు.

కూలీ, సారా పాకెట్లు అందుకొన్న దళితులు తాగి తందనాలాడి నిద్రపోయారు.

స్కూలు గోడనానుకొనే నెట్టికల్లు, సిద్ధుడు సుఖంగా నిద్రపోయారు.

ప్రత్యర్థులు ముగ్గురూ తామే గెలుస్తామని ధీమాగా రాత్రంతా తిని, తాగి, తాగించి, ఆడి పాడి, జల్సాచేసి, తెల్లవారింతర్వాత నిద్రపోయారు.

ఓట్ల లెక్కింపు అయిపోయింది. ఫలితాలు ప్రకటించారు. ఇంకా కూర్చునే ఉన్న నెట్టికల్లప్ప ఫలితాలు విని లేచి నిలబడ్డాడు.

'నువ్వు ఎన్నికల్లో నిలబడ్డావు, నిలబడరా' అంటే గోడవార కూర్చున్న నెట్టి కల్లప్ప 'నీకు ఒక కుర్చీ వచ్చిందిరా కూర్చో' అంటే లేచి, జడ్‌పిహెచ్‌యస్ దాటి. బీడి ముట్టించి పొగ పేగుల్లోకి పీకి, జడ్.పి.దాకా, జడ్‌పిటిసిగా నడవసాగాడు.